విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 25, జనవరి 2025

ఇళ్ల స్థలాల అమలుకు నోచుకోని పాలక ప్రభుత్వాలు : సీపీఐ

విశాలాంధ్ర– నందికొట్కూరు : పేద ప్రజలకు ఇళ్ల స్థలాల అమలకు పాలక ప్రభుత్వాలు నోచుకోవడం లేదని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు అన్నారు. శుక్రవారం నందికొట్కూరు పట్టణంలోని స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ అనుబంధ ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో పేదల ఇళ్ల స్థలాల కోసం గ్రామాల్లో మూడు సెంట్లు పట్టణాల్లో రెండు సెంట్లు అమలుకు తీర్మాన్నించిందని ఈ మేరకు మార్గదర్శకాలు రూపొందించి సత్వరమే అమలుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో తీర్మానించడం శుభ పరిణామ మని, అధికారంలోకి వచ్చేముందు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతానికి నిర్మాణ ఖర్చులు పెరిగినందున ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లక్షలకు బదులు, ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పేరుతో దోపిడీ జరిగిందని చెరువులు గుంతలు గుట్టల్లో స్థలాలు ఇచ్చారని కనీసం వారి స్థలం ఎక్కడ ఉందో కూడా చాలామంది ప్రజలకు తెలియదన్నారు. ప్రజలు తాము మోస పోయామనే విషయాన్ని ఇప్పుడే గ్రహిస్తున్నారని కూటమి ప్రభుత్వమైన పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాలు సాధించేవరకు ఎర్రజెండా వదల కూడదని ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి తొమ్మి దవ తేదీ సిపిఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఇళ్లులేని నిరుపేదలకు అర్హులను గుర్తించి ఇళ్ల స్థలాలకై వ్యక్తిగత అర్జీలను స్వీకరించి అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఎర్ర జెండా నీడన ఉంటేనే, పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని పేదలకు పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి శ్రీమతి రజితమ్మ, సిపిఐ పగిడ్యాల మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు, మహానంది, దినేష్ వినోద్, వీరేంద్ర,సిపిఐ నాయకులు నాగేంద్ర, సునీల్ పాల్గొన్నారు.

ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో జాతీయ బాలిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ నెరవాటి అరుణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామ కృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర ఐఎంఏ మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల ఐఎంఏ పూర్వ అధ్యక్షురాలు డాక్టర్ వసుధ రాణి, ప్రముఖ వైద్యులు నాగమణి, నర్మద, సుసుమ, విజయకుమారి, రామకృష్ణ విద్యా సంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రగతి అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాలికల ఆత్మగౌరవంపై ఆంగ్లంలో, తెలుగులో నిర్వహించిన వక్తృత్వపు పోటీలలో నంద్యాల పట్టణం, పరిసర ప్రాంతాల నుండి 170 మంది హైస్కూల్ బాలికలు పాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న బాలికలు అందరికీ ప్రశంస పత్రాలు అందజేశారు. మహిళా వైద్యులు అరిఫాభాను, నాగరేఖ, పెసల సునీత, రాధిక, శిల్పా, ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, కోశాధికారి సురేంద్ర నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్ముకున్న పొగమంచు

విశాలాంధ్ర – చాగలమర్రి : పట్టణంలో శుక్రవారం ఉదయం పొగ మంచు కమ్ముకోవడంతో వాహన చోదకులు ఇబ్బందికి గురయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పొగమంచు కమ్మేయడంతో ప్రక్కనున్న గృహాలు కూడా కనిపించలేనంత పొగమంచు అలుముకుంది. రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై లైట్లు వేసుకుంటే తప్ప వెళ్లలేని పరిస్థితి.

హెల్మెట్ ధరించి, ప్రాణాలు రక్షించుకోండి

విశాలాంధ్ర – బనగానపల్లె: మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్నప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు రక్షించు కోవచ్చుని నందివర్గం ఎస్సై వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం నాడు నందివర్గం స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు, ప్రయాణికులకు హెల్మెట్ వలన కలిగే లాభాలు తెలిపారు. అనంతరం యువకులతో కలిసి ఎస్సై, పోలీస్ సిబ్బంది హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహించారు.

26న మాంసం విక్రయాలు బంద్

విశాలాంధ్ర – బనగానపల్లె: ఈనెల 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మాంసం విక్రయాలు నిలుపుదల చేస్తున్నట్లు బనగానపల్లె పట్టణ ఈవో బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం నాడు ఏ విధమైన జంతువులను పక్షులను కోళ్లను వధించరాదని, వాటి మాంసం విక్రయించరాదని, హెూటల్లో మాంసంతో కూడిన పదార్థాల ను వడ్డించడం, అమ్మ రాదని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

సొంత స్థలంలోనే షెడ్డు నిర్మించుకుంటున్నాం

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల: మండలంలోని ఎర్రగుడి గ్రామంలో సామూహిక మరుగుదొడ్డి స్థలాన్ని ఆక్ర మించలేదని సొంత స్థలంలో గోకుల షెడ్డును నిర్మించు కుంటున్నానని రాజగోపాల్ తెలిపారు. మరుగుదొడ్డి స్థలాన్ని ఆక్రమించి గోకుల షెడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తనపై కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కొన్ని పత్రికల్లో కూడా స్థలం విషయంపై ప్రచురణ జరిగిందని అందులో వాస్తవం లేదన్నారు. ప్రభుత్వం 1999లో సర్వేనెంబర్ 342లో 0.03 సెంట్ల స్థలాన్ని తన తల్లి పి.వెంకటమ్మ పేరిట ఇంటి స్థలాన్ని మంజూరు చేసిందని, అందుకు సంబంధించిన పట్టా ఉన్నట్లు తెలిపారు. తన తల్లి పేరిట ప్రభుత్వం మంజూరు చేసిన సొంత స్థలంలోనే గోకుల షెడ్డు నిర్మాణాన్ని చేపట్టినానని, మరుగుదొడ్డి స్థలానికి సంబంధమే లేదన్నారు. సామూహిక మరుగుదొడ్డి తమ స్థలానికి అవతల వైపు ఉన్నదని తెలిపారు. నిజాలు తెలుసుకోకుండా కొందరు అపోహలు సృష్టిస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. గతంలోనే ఆయా శాఖ మండల అధికారులు స్థలాన్ని పరిశీలించారని, ఎలాంటి ఆక్రమణ జరగలేదని ధ్రువీకరించారని తెలిపారు.

నీటి వృధాను అరికట్టిన పంచాయతీ అధికారులు

విశాలాంధ్ర – బనగానపల్లె: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని బ్రిడ్జిపై, చేపల మార్కెట్ పక్కన నీళ్ల ట్యాంకి నందు పైపులైన్ ద్వారా నిరు వృధా అవుతున్నట్లు గురువారం నాడు పలు పత్రికల్లో, మీడియాలో ప్రచారం అవడం జరిగింది. దీంతో శుక్రవారం నాడు గ్రామపంచాయతీ ఈవో బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి పంచాయతీ సిబ్బందిని పంపించి ఆగమేగాల మీద మరమ్మతులు చేసి నీటి వృధాను అరికట్టడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఈవో సతీష్ కుమార్ రెడ్డి ని అభినందించడం జరిగింది.

ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షులుగా రణత్ యాదవ్, కార్యదర్శిగా జి.నాగరాముడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అఖిల భారత యువజన సమైక్య ప్రథమ మహాసభలు నంద్యాలలోని వివేకానంద ఆడిటోరియంలో నిర్వహించారు. అనంతరం స్థానిక నంద్యాల సిపిఐ కార్యాలయంలో జరిగిన ప్రతినిధుల సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులుగా రణత్ యాదవ్, జిల్లా కార్యదర్శిగా జి నాగరాముడు లతో పాటు తొమ్మిది మంది జిల్లా కమిటీని జిల్లా కౌన్సిల్ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మూతబడిన పరిశ్రమలను, కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికులకే ఉద్యోగ ఉపాధి కల్పించాలని, అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని లేనిపక్షంలో నిరుద్యోగులను పెద్ద సంఖ్యలో సేకరించి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని వారు తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా మహేష్, విష్ణువర్ధన్, విజయ్, మధు, ప్రకాష్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాని విజయవంతం చేసే దానికి సహకరించిన ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితికి జిల్లా పార్టీ యంత్రాంగం ధన్యవాదాలు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో–నంద్యాల : కూటమి ప్రభుత్వం లోనే అభివృద్ధి సాధ్యమని మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల టౌన్ సలీంనగర్, సరస్వతి నగర్, నౌమాన్ నగర్ తదితర ప్రాంతాల్లో నూతన సీసీ రోడ్లకు, డ్రైనేజీ కాలువలకు, మున్సి పాలిటీ వాటర్ పైప్ లైన్లకు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్లు, కాలువలు మంచినీటి వసతి లేక ప్రజలు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం దన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆంధ్రప్రదేశ్ని నవ్యాంధ్రప్రదేశ్గా తీర్చిదిద్దుతామన్నారు.

కుబ్రా మసీద్కు శంకుస్థాపన చేసిన మంత్రి ఫరూక్: నంద్యాల స్థానిక 25వ వార్డు నందుగల కుబ్రా మసీద్ ను నూతన హంగులతో నిర్మించడానికి ప్రభుత్వం ఇటీవలే వారికి అమౌంట్ మంజూరు చేయడం జరిగిందని, దానికి సంబంధించి మంత్రి ఎన్ఎండి ఫరూక్ శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, కుబ్రా మసీద్ కమిటీ సభ్యులు,టిడిపి వార్డు ఇంచార్జ్ లు, టిడిపి వార్డు అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

చౌడేశ్వరి అమ్మవారి పల్లకి సేవ

విశాలాంధ్ర – బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి శుక్రవారం సందర్భం ఆలయ ప్రాంగణంలో పల్లకి సేవ కార్యక్రమం ఈవో కామేశ్వరమ్మ, ఆలయ పండితులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించడం జరిగింది. ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అపుస్మా నియోజకవర్గం అధ్యక్షులు అమీర్ భాష అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ షిరిడి సాయి హై స్కూల్ లో కరస్పాండెంట్ సాయి ప్రభాకర్, ప్రిన్సిపాల్ శోభ రాణి ఆధ్వర్యంలో మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్షలను పురస్కరించుకొని విద్యార్థులకు సరస్వతి పూజ మరియు ఫేర్వెల్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమిర్ బాష మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో మానవ జీవితంలో మనుగడకు విద్య శక్తివంతమైనదని.. విద్య ఒక ఆయుధ మన్నారు. విద్య వలన సంస్కారవంతమైన క్రమశిక్షణతో కూడిన, దేశభక్తితో కూడిన జ్ఞాన సంపదల వలన విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు కీలక పాత్రధారులన్నారు.కరస్పాండెంట్ సాయి ప్రభాకర్, ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి అందరూ మంచి మార్కులు సాధించి అటు పాఠశాలకు ఇటు తల్లిదండ్రులకు పేరు తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్

విశాలాంధ్ర – నందికొట్కూరు : మండల పరిధిలోని దామగాట్ల గ్రామంలో సర్పంచ్ మాధవరం సుశీలమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. పాడి రైతులకు పశువులలో వచ్చే జబ్బులు వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి వైద్యం నిర్వహించారు. పశువులకు పరీక్షలు, గొర్రెలు, మేకలు, దూడలకు మందులను తాగిపించారు. శాలలో, ఆవులలో చర్మంపై వున్న పిడుదుల మందులు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కొట్టుకూరు పశువైద్యాధికారిణి నిర్మలాదేవి, గ్రామ టిడిపినాయకులు రత్నం, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

విశాలాంధ్ర – శిరివెళ్ల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో అంగన్వాడి టీచర్లు, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అని మహాలక్ష్మి లాంటి బాలికలకు అవకాశాలు కల్పిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. బాలికల పట్ల వివక్షను విడనాడి స్వేచ్ఛని వ్వాలన్నారు. వసుంధర దేవి, వెంకటసుబ్బమ్మ,ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

హమాలి కూలి రేట్లు పెంచాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర – డోన్ : రాష్ట్రవ్యాప్తంగా ఉండే సివిల్ హమాలి కార్మికుల వేతనాల పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు.సివిల్ హమాలి కార్మికుల రాష్ట్ర సమితి పిలుపు మేరకు డోన్ పట్టణంలో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ మాట్లాడుతూ ఏపి స్టేట్ సివిల్ సప్లై కార్పొరేషన్ నంద్యాల జిల్లాలోని డోన్ మండల స్టాక్ పాయింట్ నందు పనిచేసే హమాలీలకు పెంచాల్సిన 2024 జనవరి నుండి నేటి వరకు 13 నెలలుగా కూలీ రేట్లు పెంచలేదన్నారు. ఏఐటీయూసీ యూనియన్ పలు దఫాలుగా ధర్నాలు చేసిన ఈ ప్రభుత్వం ఎటువంటి జీవో విడుదల చేయలేదని, ఏఐటీయూసీ యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేపట్టడం జరిగిందన్నారు. తమ కూలిరేట్లు పెంపుదలపై జీవో వచ్చిన యెడల మళ్ళీ యథవిధిగా విధుల్లో చేరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హమాలీలు రామాంజినేయులు, వీరాంజనేయులు, నాగరాజు, గిడ్డయ్య అస్వాములు, రంగస్వామి, మహేంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర – చాగలమర్రి : పట్టణంలోని బుగ్గ రస్తాలో గల క్రీడా మైదానంలో తాలుకా స్థాయి క్రికెట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. టిడిపి నాయకులు ఆలంసాగారి మౌళాలి, హనీఫ్లు ప్రారంభించారు. నిర్వహకులు రఫీ, అల్తాఫ్లు మాట్లాడుతూ ఆళ్లగడ్డ తాలుకా పరధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 28 జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఈ పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ 20 వేలు టిడిపి నాయకులు ఆలంసాగారి హనీఫ్, రెండో బహుమతి రూ 10 వేలు తౌపీద్, పెయింటర్ ముస్తాక్లు, మూడో బహుమతి రూ5వేలు సలీంలు అంద జేస్తారన్నారు. కార్యక్రమం లో పీడీ దాదాపీర్, టిడిపి నాయకులు విద్యా కమిటీ చైర్మన్ జల్సా గౌస్, గఫార్, జిలేబి షరీఫ్, షఫి, అబ్దుల్లా, దాతలు సోహెల్, మాధవి సప్లయర్స్ సుబ్బన్న, గాడి దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర –అవుకు: మండలంలోని ఎరువుల, పురుగు మందుల దుకాణ యజమానులు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ అన్నారు. శుక్రవారం అవుకు పట్టణంలోని ఎరువుల, పురుగుల మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ ధరకు అమ్మితే చర్యలు తప్పవని అన్నారు. రైతు అడిగిన ఎరువులు మాత్రమే విక్రయించాలని యూరియాతోపాటు లింకు ఎరువును తీసుకోమని రైతులకు ఒత్తిడి చేరాలని అన్నారు. రైతుల నుండి ఏవైనా ఫిర్యాదులు అందితే కచ్చితంగా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో యూరియా, ఇతర ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు రబీ పంటకు సంబంధించి ఫిబ్రవరి 25లోపు పంట నమోదు మరియు ఏకేవైసీ చేయించుకోవాలని అన్నారు.

హెల్మెట్తోనే ద్విచక్ర వాహనదారులకు రక్ష

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : హెల్మెట్ వినియోగించడంతో ద్విచక్ర వాహనదారులకు రక్షణగా ఉంటుందని సీఐ రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఆయన ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి హెల్మెట్ వినియోగంపై బైక్ లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం నందు ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఎక్కువ శాతం బాధితులు హెల్మెట్ ధరించకపోవడంతో తలకు తీవ్ర దెబ్బలు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రాణాలు ఎంతో విలువైనవని హెల్మెట్ వినియోగంపై నిర్లక్ష్యం వద్దని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణం కోల్పోతే ఓ కుటుంబం వీధిన పడుతుందన్నారు. ద్విచక్ర వాహన దారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు.

ఆలమూరులో పారుపేట ఉత్సవాలు

విశాలాంధ్ర– రుద్రవరం: ఆలమూరు గ్రామంలో రెండవ రోజు అహెూబిల లక్ష్మీ నరసింహ స్వామి పారవేట ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో ఎంపిక చేసిన తెలుపులపై ఉత్సవమూర్తులను కొలువుదిర్చి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామంలోని వీధిలో వివిధ రకాలకు చెందిన ఆట బొమ్మలు వస్తువుల అంగళ్లతో పండుగ వాతావరణం నెలకొంది.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



విశాలాంధ్ర– పాణ్యం: మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థిని వెంకట వైష్ణవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపి కైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలలో విద్యార్థిని ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 25 నుంచి 27 వరకు విశాఖపట్నం అనకాపల్లిలో జరిగే సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో విద్యార్థిని పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ పీడీ చంద్రారెడ్డి అభినందించారు.

మండలంలో విద్యుత్ అంతరాయం...

విశాలాంధ్ర – ఆత్మకూర్ రూరల్ : ఆత్మకూరు మండల పరిధిలో శనివారం మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 5 గంటల వరకు 132/33 సబ్ స్టేషన్ ఆత్మకూరులో మెయింటెనెన్స్ పనుల కారణంగా ఆత్మకూరు పట్టణం, పాములపాడు మండలం, వెలుగోడు మండలం, మరియు కొత్తపల్లి మండలాలకు సంబంధించిన విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఉంటుందని ఆత్మకూరు ఐటీఎల్యు, ఏపీ ఎస్పీడీసీఎల్ వారు తెలియజేశారు.

వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలి

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్: నంద్యాల జిల్లాలో పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలసలు పోతున్నారని, దీనిని వెంటనే నివారించాలని వారికి పని చూపేందుకు గ్రామీణ ఉపాధి పనులు చేపట్టి గ్రామీణ ప్రజలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నంద్యాల జిల్లా సబ్ కలెక్టర్ విష్ణు చరణ్కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కె.రాధాకృష్ణ మాట్లాడుతూ నంద్యాల జిల్లా పరిధిలోని డోన్, ప్యాపిలి, నందికొట్కూరు, ఆత్మకూరు నియోజక వర్గాల్లోని పలు మండల, గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు లేకపోవడంతో గుంటూరు లాంటి ఇతర ప్రాంతాలకు బతుకు జీవనం కోసం పిల్ల పాపలతో సహా వలస వెళుతున్నారని అన్నారు. వారికి ఉపాధి కల్పించేందుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేసి వారికి రోజు వేతనం రూ.700లు మంజూరు చేయడం వల్ల వలసలు ఆగుతాయని అన్నారు. జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు కల్పించాలని ఉపాధి హామీలో చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించి, పెండింగ్ బకాయి బిల్లులు చెల్లించాలని అన్నారు. ఉపాధి హామీల్లో అధికార పార్టీ నాయకుల ప్రమేయం నివారించి గ్రామాలు వదిలి వలస వెళ్లిన వారిని తిరిగి గ్రామాలకు రప్పించి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం పరిశ్ర మలు ఏర్పాటు చేయాలని వ్యవసాయానికి సాగు నీరు అందిస్తే ఉపాధి అవకాశాలు పుష్కలంగా పెరిగితాయని వలసల నివారణకు ఉపయోగపడుతుందని అన్నారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేసే క్షేత్రస్థాయి సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కారణాలతో తీసివేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు వలసలు నివారించాలని కోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.ప్రతాప్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వై.ఉదయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు మనోజ్, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కరీం పాల్గొన్నారు.

దోమలపై దండ.. యాత్ర వాడవాడలా ఫాగింగ్

విశాలాంధ్ర – శిరివెళ్ల: మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ పంచాయతీ గ్రామంలో దోమలపై దండయాత్ర మొదలైందని వాడవాడల పాగింగ్ పొగ ద్వార దోమల ఉధృతి నియంత్రణకు ఉత్పత్తి నిర్మూలనకు తగిన చర్యలు చేపట్టినట్లు గ్రామపంచాయతీ ఈవో అశ్విని కుమార్ తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర,వైస్ ప్రెసిడెంట్ బసాపురం ఇంతియాజ్, శానిటేషన్ సిబ్బంది తదితరుల సమక్షంలో శుక్రవారం ఫాగింగ్ ప్రక్రియను ముమ్మరం చేసినట్లు తెలిపారు. దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రథమంగా ఫాగింగ్ చేస్తున్నామని తెలిపారు.

తాగునీటి లీకేజ్ని సరిచేసిన అధికారులు

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎదురుగా తాగునీటి పైప్లైన్ లీకేజీపై సంబంధిత అధికారులు స్పందించారు. ఈ నెల 21న విశాలాంధ్రలో లీకేజీతో తాగునీరు కలుషితంపై కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి సరి చేశారు. సర్పంచ్ శివ రాముడు ఆధ్వర్యంలో శుక్రవారం తాగునీటి లీకేజీ ప్రాంతానికి చేరుకొని దెబ్బతిన్న పైపును తొలగించి, కొత్త పైపును అమర్చారు. ఈ పైప్లైన్ ద్వారా ప్రధాన కాలనీకి తాగునీరు సరఫరా అవుతున్నది. లీకేజీ ఏర్పడిన పైపును తొలగించి కొత్త పైపు ఏర్పాటు చేసి త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవడంతో స్థానికులు వర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 25, జనవరి 2025

వలసల నివారణలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం : ఆవుల శేఖర్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు, పేదలు, కౌలుదారులు గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నా, వలసలు నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, డ్వామా పీడీలకు మెమోరాండాలు సమర్పించడంలో భాగంగా జిల్లా డ్వామా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయలక్ష్మికి వలసలు నివారించాలని కోరుతూ వినతి పత్రం అంద చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు మొదలు పెట్టాలని, రోజు వేతనం రూ.700 ఇవ్వాలని, జాబ్ కార్డ్ తో నిమిత్తం లేకుండా 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఉపాధి కూలీలకు సకాలంలో పనులు కల్పించకపోతే చట్టంలో పొందుపరిచిన విధంగా పని కల్పించేంత వరకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీలో రాజకీయ జోక్యం నివారించాలని పని ప్రదేశాలలో మెడికల్ కిట్లు, గుడారాలు అందుబాటులో ఉంచాలన్నారు. వంద రోజులు పని పూర్తి చేసుకున్న ఉపాధి కూలీలకు గడ్డపారలు, పనిముట్లు ఇవ్వాలని, రెండు పూటలా పని విధానం తీసివేయాలన్నారు. ఉపాధి హామీలో పని చేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో వలసలు తీవ్రంగా పెరిగిపోయాయని, వలసలు నివారణకు ఏ చర్యలు తీసుకోవడం లేదని, ఉపాధి సిబ్బంది అలసత్వమే కారణమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయిపోతున్నా, ప్రభుత్వానికి, ఇటు సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికే వలసలు వెళ్లిన వారిని తిరిగి గ్రామాలకు రప్పించి ఉపాధి హామీ పనులు కల్పించాలి. లేనిపక్షంలో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు సి.మహేష్, బాబయ్య, శేషు, మధు ఉన్నారు.

బాబు గారు.. మెగా డీఎస్సీ ఏమైంది.? బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య విమర్శించాడు. శుక్రవారం నాడు స్థానిక సీఆర్ భవన్ నందు ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు ఈ శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గిడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 7 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ఎన్నికల హామీలలో సూపర్ సిక్స్ లో భాగమైన తల్లికి వందనం పథకాన్ని వచ్చే విద్యా సంవత్సరంలో అమలు చేస్తానని చెప్పడం తల్లికి వందనం మరచి తండ్రికి ఇంధనం మాత్రం విచ్చలవిడిగా మద్యం షాపులు తెరిచాడని ఆయన విమర్శించాడు. నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెంచే విధంగా ఏఐవైఎఫ్ కార్యకర్తలు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు కారుమంచి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ 45 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మసి పూసి మారేడు కాయ చేయడంలో సిద్ధహస్తుడన్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ పై మొదటి సంతకం చేసి ఇప్పటివరకు డీఎస్సీ పైన స్పష్టత ఇవ్వకుండా డీఎస్సీ అభ్యర్థులు తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల పైన శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. గ్రూప్ 1, 2 ఎస్సై కానిస్టేబుల్ పోస్టులకి నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిని ఫ్రీ జోన్‌గా ప్రకటించాలన్నారు. ఫిబ్రవరి 6 నుండి 9 వరకు శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలలో చర్చా వేదిక కానున్నాయన్నారు. ఈ మహాసభకు అధిక సంఖ్యలో యువతి, యువకులు, నిరుద్యోగులు తరలివచ్చి ఫిబ్రవరి 6 తేదీన జరిగే ర్యాలీ బహిరంగ సభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు హనుమేష్, రమేష్, జిల్లా సహాయ కార్యదర్శిలు బీసన్న, రాజు, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ దారుణ హత్య

- ఫ్యాక్షన్ గ్రామంలో వ్యక్తి దారుణ హత్య • వేటకొడవళ్లతో నరికి చంపిన వైనం
- ఉలిక్కిపడ్డ అరికేర గ్రామం • ఓ కుటుంబంపై అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబీకులు
- హత్యను ఖండించిన ఎమ్మెల్యే, కమ్యూనిస్టు పార్టీ, ప్రజా సంఘాల నాయకులు

విశాలాంధ్ర – ఆలూరు: మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన అరికేర గ్రామంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. దీంతో ఒక్కసారిగా గ్రామం ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళ్తే.. అరికేర గ్రామానికి చెందిన బండారి కురువ ఈరన్న (45) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యాడు. కాగా, బండారి కురువ ఈరన్న గత ఐదేళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. యథావిధిగా రోజుమాదిగా ఉపాధి హామీ పనుల దగ్గర కొలతల తీసుకునేందుకు వెళుతుండగా మార్గమధ్యలో కాపుకాచి గుర్తు తెలియని దుండగులు వేట కొడవళ్లతో తలపై, వీపు భాగాన నరికి పరారయ్యారు. ఆ దారిన వెళ్లే వారు జరిగిన సంఘటనను చూసి, కుంటుంబీ కులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పత్తికొండ డీఎస్పీ వెంకట రామయ్య, కర్నూలు క్రైం బ్రాంచ్ వారు, సీఐ వెంకట చలపతి, ఎస్సై దిలీప్ కుమార్, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరకున్నారు. డాగ్ స్క్వాడ్ ద్వారా నిందితుల కోసం గాలించారు. అనంతరం పోస్టు మార్టం నిమిత్తం ఆలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. దబ్బల గాదిలింగ అనే వ్యక్తిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రేరేపించడం దారుణం – ఎమ్మెల్యే విరుపాక్షి: కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రేరేపించడం దారుణమని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆరోపించారు. అరికెర గ్రామంలో జరిగిన హత్యా ఘటనపై ఎమ్మెల్యే స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం హత్యా రాజకీయాలను ప్రేరేపించడం దారుణమని, ఇలాంటి హత్యా రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. అభివృద్ధికి పట్టం కట్టాలని ఆయన అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు ఆయా నియోజవర్గాలకు ఇంచార్జులను కేటాయించి, అభివృద్ధి బాటపట్టేలా చూడాలని కోరారు. హత్యకు గురైన ఈరన్న మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. నిందితులను త్వరగా అదుపులోకి తీసుకొని, కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

హంతకులను శిక్షించాలి : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర – కర్నూలు : ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న బండారి ఈరన్నను దారుణంగా నరికి హత్య చేయడాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లును మార్చడం పరిపాటిగా మారిందన్నారు. బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్ బండారు ఈరన్నను రాజీనామా చేయాలని బెదిరిస్తూ ఒత్తిడి చేశారని,రాజీనామా చేయడానికి కొంత సమయం కోరినప్పటికీ పట్టించుకోకుండా శుక్రవారం మోటార్ సైకిల్ పై పోతుండగా గొడ్డలితో నరికి దారుణముగా హత్య చేయడం దారుణమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

బండారి ఈరన్న హత్య దారుణం..

విశాలాంధ్ర – కర్నూలు : ఆలూరు మండలం అరికేర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బండారి ఈరన్నను దారుణంగా నరికి హత్య చేయడాన్ని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణ,ఎం నబి రసూల్, జిల్లా ఉపాధ్యక్షులు భూపేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీలో పని చేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యా యన్నారు. వీటిని ఆపాలని గతంలోనే ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వేధింపులు ఆగడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను మార్చాలనుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని, ఇది మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర – హొళగుంద: మండలంలోని ముదట మాగిలో శుక్రవారం సిసి రోడ్డు పనులను సీనియర్ వైసీపీ నాయకుడు కోగిల తోట శేషప్ప ప్రారంభించారు. జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ ఇచ్చిన రూ.5 లక్షల నిధులతో స్థానిక మారెమ్మ ఆలయం నుండి ఆంజనేయస్వామి ఆలయం వరకు సిసి రోడ్డు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వైసీపీ సీనియర్ నాయకుడు కోకిల తోట శేషప్ప మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం గ్రామంలో సిసి రోడ్డు వేశామన్నారు. గ్రామం మొత్తం పోటు రాళ్లు తేలి ప్రజలు నానా అవస్థలు పడి తిరిగేవారని స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిమెంట్ రోడ్డు వేశామని అన్నారు. ఈ ఓఆర్ డి.చక్రవర్తి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కేగిరి, మండల వైకాపా కన్వీనర్ షఫీ ఉల్లా, వైసీపీ నాయకులు రమేష్, సిద్ధప్ప, గాది లింగ, పంపన్న, మల్లికార్జున, లక్ష్మన్న, హెన్నూరప్ప, దేవన్న పాల్గొన్నారు.

మద్దతు ధరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: కందులు ప్రభుత్వానికి అమ్మదలచిన రైతులు మద్దతు ధర కోసం రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంటను సాగు చేసి ఈ కేవైసీ చేసుకున్న రైతుల కు మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాలలో కందులు కొనుగోలు చేసేందుకు మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఒక క్వింటానికి రూ.7550 ప్రకారం ప్రకటించడం జరిగిందన్నారు. రైతు సోదరులు తమ పరిధిలో ఉన్న రైతు సేవ కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దివ్యాంగులపై వైసీపీది ప్రేమ

విశాలాంధ్ర – ఆదోని రూరల్: వైసీపీ దివ్యాంగులపై కపటి ప్రేమ చూపిస్తుందని అమ్మ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కమతం వెంకటేష్ ప్రకటన ద్వారా విమర్శించారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు వికలాంగులు గుర్తుకు రాలేదా అంటూ సూటిగా ప్రశ్నించారు. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దివ్యాంగులు సమస్యలను,బాధలను, కష్టాలను అర్థం చేసుకుని రూ.6వేలు పింఛన్‌లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. ఆంధ్ర రాష్ట్ర దివ్యాంగుల తరఫున చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర – కోడుమూరు: ఈ నెల 30,31న విజయవాడలో నిర్వహించే ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి రాజు, ఏఐటియుసి నాయకులు మద్దూరు చిన్న రాముడు,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు మధులు ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి రాజు, ఏఐటీయూసీ మద్దూర్ రాముడు,ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మధులు ఆటో కార్మికులతో కలిసి రాష్ట్ర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోలు నడుపుతూ జీవనము సాగిస్తున్న ఆటో డ్రైవర్ల జీవన విధానం రోజురోజుకు దుర్భరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, డీజిల్, గ్యాస్, పెట్రోలు ధరలను చూస్తే ఆటో కార్మికునికి కంటిమీద కునుకు రావడం లేదన్నారు. రాత్రనక, పగలనక ఆటో నడిపినా చివరకు ఆటో ఫైనాన్స్ కట్టుకొనడానికి సమయానికి డబ్బులు ఉండక ఆందోళనకరమైన పరిస్థితులను గడుపుతున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన రోడ్డు రవాణ చట్టాన్ని తీసుకొచ్చి ప్రమాదాలు జరిగితే కార్మికులకు జైలు శిక్ష, లైసెన్ల రద్దు వంటి దుర్మార్గమైన చట్టాలను అమలు చేస్తాననడం సబబు కాదన్నారు. ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పి చెప్పేందుకు వేదికగా ఈనెల 30,31 విజయవాడలో జరిగే రాష్ట్ర మహాసభలకు ఆటో కార్మికులంతా పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిన్న, రామకృష్ణ, దస్తగిరి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్‌లు, యూనిఫాం, ఐడీ కార్డులు ధరించాలి

విశాలాంధ్ర-గోనెగండ్ల: డ్రైవర్ లను, గుర్తించాలని గోనెగండ్ల డ్రైవర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్ నుంచి కుర్ణి కళ్యాణ మంటపం వరకు ర్యాలీ వెళ్లి, డ్రైవర్‌లు, డ్రైవర్‌లను గుర్తించాలని నినాదాలు చేశారు. డ్రైవర్‌లు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సమావేశా నికి ముఖ్య అతిథులుగా సీఐ గంగాధర్, ఆదోని ఆర్‌టిఓ, ముహమ్మద్ ఆసిఫ్, సెఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎస్ ముహమ్మద్, సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు. అన్వర్ బాష, ఇషాక్, కోడుమూరు రాఘవేంద్ర, దేవరకొండ ఇజాజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **నూతన కమిటీ ఎన్నిక:** గోనెగండ్ల సెఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు బుట్ట ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ ఎస్ ఖాజా ఖాద్రీ, కార్యదర్శి ఎం.మస్తాన్ వలి, సహాయ కార్యదర్శి, డి.వలి, కోశాధికారి ఎ.మెహిన్, కార్యవర్గ సభ్యులు కటకం ఉత్తేజ్, గజేంద్ర, చంద్రశేఖర్, సుంకన్న, వలి, షేక్షావలి. 75 మంది కమిటీ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జేబీ గార్డెన్‌లో పట్టణంలోని అన్ని స్టాండ్‌ల నుండి ఆటో కార్మికులతో పెద్ద ఎత్తున సమావేశం జరిగింది. సమావేశాన్ని ఉద్దేశించి వీరేష్, గోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 31న విజయవాడలో జరుగు ఆటో యూనియన్ రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన యువత ఉద్యోగాలకు జీవనోపాధి కోసం ఆటో రంగాన్ని ఎన్నుకొని తమ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు విజయ్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు లింగప్ప, ఆటో స్టాండ్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, రవికుమార్ పీటర్ నరసింహులు, చిట్టిబాబు, నాగరాజు, శ్రీరామ్, ఈరన్న, తిక్కస్వామి,ఈరన్న, మరి స్వామి, శరత్ బాబు, పాండు పాల్గొన్నారు.

బాలికలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర – కౌతాళం: బాలికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రతిభ హై స్కూల్ సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని బాలికలకు స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం బాలికలకు, వారి తల్లిదండ్రులకు ఉద్దేశించి, మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నినాదం ఆడపిల్లను పుట్టనిద్దాం, బ్రతుకునిద్దాం, చదవనిద్దాం, ఆడపిల్లకు రక్షణ కల్పిద్దాం, ఆడపిల్ల దేశానికే గర్వకారణం అన్న మాటలను ఆడపిల్లలు గల ప్రతి తల్లి తండ్రి నిజం చేయాలని అన్నారు. ఆడపిల్లలు విద్యాభివృద్ధితో పాటు సమాజాభివృద్ధిలో ముందుకెళ్లాలంటే తప్పనిసరి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉండాలన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో వర్క్ ఫ్రం హోం ఆడపిల్లలు, గృహిణులు, ఇంటి వద్దనే పని చేసుకునే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగంలోనూ, రాజకీయరంగంలోనూ, అనేక కంపెనీలలో, అవకాశాలను కల్పించడం జరుగుతుంది మరి అలాంటి అవకాశాలను మన ఆడపిల్లలు సద్వినియోగం చేసుకొని సమాజాభివృద్ధిలో సమాజ నిర్మాతలుగా నిలబడాలని కోరారు. ఝాన్సీ రాణి, రుద్రమదేవి, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన భారత తొలి మహిళ భజేంద్రిపాల్, సమాజ సేవకురాలు మదర్ తెరిసా, భారతదేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ, గాన కోకిల సరోజినీ నాయుడు, ఏపీజే అబ్దుల్ కలాంతో పనిచేసిన మహిళా సైంటిస్ట్, మిస్సైల్ ఉమెన్ టే సి థామస్ ఇలా ఎందరో గొప్ప మహిళా మూర్తులను నేటి బాలికలు ఆదర్శంగా చేసుకుని ముందుకెళ్లాలని విద్యార్థినీలకు సూచించారు. కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష, ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్య బలోపేతం చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు అన్నారు. శుక్రవారం స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళా శాలలో పాఠశాల విద్య బలోపే తంపై ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులు, ఎంఈఓలతో, సంబంధిత జిల్లా అధికారులతో రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా శాఖ కమిషనర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో విద్యా శాఖకి సంబంధించి ప్రభుత్వం రూ.24 వేల కోట్లు బడ్జెట్ కేటాయించిందన్నారు. 45 వేల ప్రభుత్వ పాఠశాలలకు లక్షా 88 వేల టీచర్లు ఉన్నారని, 35 లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారన్నారు. పాఠశాల కేంద్రంగా అమలవుతున్న విద్యావిధానాలు క్షేత్రస్థాయిలో ఆచరణాత్మకంగా సత్ఫలితాలు సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఏ విధంగా బలోపేతము చేయాలనే అంశంపై చర్చించడం జరిగిం దన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డుల్లో మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల డేటా, ఆన్లైన్ లో ఉన్నటువంటి ఎన్రోల్మెంట్ డేటా ను ప్రత్యేక అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు వెరిఫై చేసి కలెక్టర్ ద్వారా తమకు పంపించాలన్నారు..పాఠశాలల్లో చేపట్టాల్సిన మార్పులు చేర్పులపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. వారి అభిప్రాయాలను సమీకరించి ఒక సమగ్ర అధ్యయన నివేదిక రూపొందిస్తామని కమిషనర్ తెలిపారు. కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, కర్నూలు జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మండల స్పెషల్ అధికారులు, డీఈఓ శ్యామ్యూల్ పాల్, మండల విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటి ఎన్నిక

విశాలాంధ్ర – కర్నూలు : నగర ఆటో వర్కర్స్ యూనియన్ నూతన కమిటి ఎన్నుకున్నారు. కర్నూల్ అంబేద్కర్ భవన్లో జరిగినటువంటి నగర ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 9వ నగర మహాసభల సభ్యులు నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగర గౌరవ అధ్యక్షులుగా బి.వెంకటేశు, నగర అధ్యక్షులుగా ఎన్ రాము, కార్యనిర్వాహక అధ్యక్షులుగా రఘు, ఉపాధ్యక్షులుగా ఆర్. ఈశ్వర్‌రెడ్డి, శీను నాయక్, మృతుజావలి నగర కార్యదర్శిగా ఆర్ కృష్ణారెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శిగా బి.నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జయరామిరెడ్డి, నగర సహాయ కార్యదర్శులుగా అబ్బాస్, స్వాములు,ట్రెజరర్ గా తో పాటు వివిధ అడ్డాల నుంచి 40 మంది కౌన్సిల్ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి టి రామాంజనేయులు, మల్లన్న, రహిమాన్‌లు హర్షం వ్యక్తం చేశారు.

హనుమంతు మృతికి సంతాపం

విశాలాంధ్ర – కర్నూలు : సీనియర్ విశాలాంధ్ర పాత్రికేయులు హనుమంతు మృతికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వెల్దుర్తిలో విలేకరిగా, ఫోటో గ్రాఫర్‌గా ప్రజలకు, జర్నలిస్ట్‌లకు సుపరిచితుడు. కమ్యూనిస్ట్ పార్టీ పట్ల విశ్వాసం,నమ్మకం, ఉండే వాడు.మంచి స్నేహశీలి. హనుమంతు మృతితో మంచి జర్నలిస్ట్ ను, సీపీఐ మంచి అభిమానిని కోల్పోయిందన్నారు.హనుమంతు మృతికి సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి : సీపీఐ

విశాలాంధ్ర– పత్తికొండ: పట్టణంలోని పార్వతి కొండ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ నాయకులు విద్యుత్ శాఖ ఏడిఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు సిపిఐ ఆధ్వర్యంలో భూ పోరాటం చేపట్టి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం జరిగిందని పేదలు నివాసం ఉంటున్న కాలనీలలో విద్యుత్ స్తంభాలు, సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిమ్మయ్య, శాఖా కార్యదర్శులు నాగేంద్ర, గిడ్డయ్య గౌడ్, నాయకులు రవి, ఏంగిల్స్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని వ్యక్తి బావిలోపడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర – పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో మతిస్థిమితంలేని వ్యక్తి శనివారం బావిలోపడి మృతి చెందారు. గత మూడు రోజులుగా మతిస్థిమితం సరిగాలేని ఓ వ్యక్తి కల్లుకుంట గ్రామ పరిసరాల్లో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఊరికి దూరంగా పెద్దకడబూరు రోడ్డు పక్కన ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. పొలంలో పని చేస్తున్న మహిళలు గమనించి, యువకులకు సమాచారం ఇవ్వడంతో బయటకు తీశారు. అప్పటికే వ్యక్తి మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు.

తండ్రి కొడుకులకు దావోస్ పర్యటన.. విహారా యాత్రలా మారింది

విశాలాంధ్ర –కర్నూలు సిటీ: తండ్రి, కొడుకుల దావోస్ పర్యటన విహారా యాత్రలా మారిందని వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి విమ ర్శించారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని వైసీపీ కార్యాలయంలో ఆయన నగర మేయర్ బీవై రామయ్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కె.శ్రీదేవి కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేష్, టీజీ భరత్‌ల దావోష్ పర్యటనలో పెట్టుబడుల యాత్ర కాస్త విహారయాత్రలా సాగిందని ఎద్దేవా చేశారు. లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్‌ను సస్య శామలం చేస్తామని ఊదరగొట్టి అక్కడికి వెళ్లి ఉట్టి చేతులతో తిరిగి వచ్చారని దుయ్యబట్టారు. దావోస్‌లోని పారిశ్రామిక వేత్తలు చంద్రబాబును నమ్మలేదని అర్థమవుతుందని చెప్పారు. ఇదే సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జాతీయ మెడికల్ కౌన్సిల్‌ను ఒప్పించి 14 మెడికల్ కాలేజీలను స్థాపిస్తే అందులో ఐదు మెడికల్ కాలేజీ ప్రారంభమైనప్పటికి మిగతా వాటిని ప్రారంభం కాకుండా ప్రభుత్వమే అడ్డుపడుతుందన్నారు. దేశ చరిత్రలో ఇటువంటి దుర్మార్గపు ప్రభుత్వాన్ని చూడలేదని విమర్శిం చారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డిని నమ్మి అనేక పరిశ్రమలు ముందుకు వచ్చాయని, వాటిని ప్రారంభించకుండా ప్రభుత్వ అడ్డుకుంటుందని ఆరోపించారు. వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఈ-శ్రమ కార్డు అవసరం

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల: కలెక్టర్ కార్యాలయం లోని సమాచార భవనంలో వర్కింగ్ జర్నలి స్టులకు డాక్టర్ శంకర్ శర్మ ఆధ్వర్యంలో ఈ-శ్రమ కార్డులు శుక్రవారం ఉదయం పంపిణీ చేశారు. లేబర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సమాచార భవనం వద్దకు వచ్చి విలేకరులకు ఈ-శ్రమ కార్డులను ఆన్ లైన్ లో నమోదు చేసి ముఖ్య అతిథి డాక్టర్ శంకర్ శర్మ చేతుల మీదుగా అందజేశారు.ఈసందర్భంగా డాక్టర్. శంకర్ శర్మ మాట్లాడుతూ జర్నలిస్టుల విధి నిర్వహనలో ఎలాంటి రక్షణ లేకుండా ఉంటారని అలాంటి వారికి ఈ-శ్రమ కార్డులు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విలేకరులకు వార్తల విషయంలో దౌర్జన్య కారులతో, గుండాలతో ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొంటారన్నారు. ప్రతి ఒక్కరు రాజ్యాంగం కల్పించిన వారి హక్కుల గురించి తెలుసుకోవాలని డాక్టర్.శంకర్ శర్మ కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విలేకరులకు ఎలాంటి సదుపాయాలు ఇస్తున్నారో తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్డు ద్వారా జర్నలిస్టులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు శ్రీలక్ష్మి, కేశన్న, రాంప్రసాద్, విలేకరులు రామస్వామి, చెన్నయ్య, సురేష్, రాజు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 25, జనవరి 2025

యువత ఓటే.. ప్రజాస్వామ్యానికి పునాది

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల: కర్నూలు మెడికల్ కళాశాలలో శుక్రవారం జనవరి 25 జాతీయ ఓటర్ దినోత్సవం పై అవగాహన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యానికి పునాది లాంటిది అని అన్నారు. దేశ పౌరులు అధిక సంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన వారు అవుతారని ఆమె అన్నారు. విధిగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఓటు అన్నది పౌరుల ప్రాథమిక బాధ్యతగా గుర్తు గుర్తుంచుకోవాలన్నారు. ఎలాంటి ప్రభుత్వం ఉండాలి, ఎలాంటి నాయకులను ఎన్నుకోవాలి అన్నది ఓటరు యొక్క నిర్ణయం పై ఆధారపడి ఉంటుందని, తమ పాలకులు ఎలాంటి వారు కావాలో నిర్ణయించుకోవాల్సింది ప్రజలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమశేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణమోహన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ నాగార్జున పాల్గొన్నారు.

అన్ని రకాల పంటలకు మద్దతు ధర చట్టాన్ని తేవాలి

విశాలాంధ్ర ఎమ్మిగనూరు: ఢిల్లీలో రైతులు 13 నెలల పాటు సాగిన పోరాటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం లిఖితపూర్వకంగా రాసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 26వ తేదీన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, రైతు కూలి సంఘం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రప్ప, పంపన్న గౌడ్, ఐఎఫ్టియు నాయకులు ప్రసాద్, ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు వీరేష్ తెలిపారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో రైతు కార్మిక సంఘాల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం 13నెలలు పాటు సాగిన రైతు ఉద్యమం సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీలో రైతులు చేపట్టిన రైతు ఉద్యమానికి తలవంచి రద్దు చేసిన చట్టాల లోని విధానాలతోనే తిరిగి చట్టాలను తీసుకువస్తుందనీ, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన సహకార చట్టం, వ్యవసాయ సాంకేతిక చట్టం మొత్తం రైతాంగాన్ని కార్పొరేట్ కంపెనీల పెత్తనం క్రిందకు తెచ్చేందుకు చేసినవే, సహకార చట్టంలో చేసిన మార్పుల వల్ల సహకార పరపతి సంఘాలు,పాడి సహకార సంఘాలు, మత్స్య సహకార సంఘాలు మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీల గొడుగు క్రిందకు చేర్చడమే లక్ష్యంగా ఉన్నాయి. సహకార వ్యవస్థలన్నీ కంపెనీల హస్తగతం అవుతాయి. కేంద్ర ప్రభుత్వం నూతనంగా జారీచేసిన వ్యవసాయ మార్కెట్ల జాతీయ విధాన చట్టం ప్రకారం మొత్తం విధానాలను వ్యవసాయాధారిత పరిశ్రమాధిపతులు, ఎగుమతి, దిగుమతి దారులు, విదేశీ వ్యాపారులు రైతులు పంటలను స్వేచ్ఛగా కొనుగోలు చేయడం, నిల్వ చేసుకోవడం, ఎగుమతి చేసుకోవడానికి అనుకూలంగా మార్పులు చేసిందనీ వారు తెలిపారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల విధానం ఉండదనీ వ్యాపారులు ఇష్టారాజ్యం అవుతుంది. ధరలు పడిపోయినప్పుడు రైతులను ఆదుకొనుటకు మార్కెట్ కొనుగోళ్లు ఉండవు, ఆహార భద్రత చట్టానికి తావు లేదు, ఇప్పటికే ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడుస్తుంది. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి కెని.జబ్బర్,రైతు కార్మిక సంఘాల నాయకులు రంగన్న, భాస్కర్ యాదవ్, సుందర్ రాజు,సమీవుల్లా, దాదావలి, విజయేంద్ర, మల్లికార్జున, నరసింహులు, బాష, గురు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన హృదయం 27న ప్రారంభం

విశాలాంధ్ర – కర్నూలు: జీ తెలుగు ఛానల్ ఆరంభం నుంచి ఆసక్తికరమైన అంశాలతో, ఆకట్టుకునే కాన్సెప్ట్లతో ఫిక్షన్, నాన్ ఫిక్షన్ షోలను అందిస్తూ తెలుగు ప్రేక్షకులకు వినోదం పంచుతోంది. ఊహించని మలుపులు, ఆసక్తికర కథనాలతో సాగే సీరియల్స్తో ఆకట్టుకుంటోన్న జీ తెలుగు మరో కొత్త సీరియల్తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ ఎన్నాళ్లో వేచిన హృదయం జనవరి 27న ప్రారంభం కానుంది. బాధ్యతలు, బంధాలే ప్రధానంగా సాగే అందమైన ప్రేమకథ ఎన్నాళ్లో వేచిన హృదయం సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2:30 గంటలకు, మీ జీ తెలుగులో! ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ త్రివుర అనే ఒక స్కూల్ టీచర్, వ్యాపారవేత్త అయిన బాలకృష్ణ మధ్య సాగే కథతో రూపొందుతోంది.

ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర – నందవరం: మండల కేంద్రమైన నందవరం గ్రామం పంచాయతలో ఎమ్మిగనూరు ఆర్కే వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ కె.హేమంత్ కుమార్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామని, ఆపరేషన్ అవసరమైనటువంటి వ్యక్తులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఎమ్మిగనూరు ఆర్కే వైద్యశాల నందు కంటి ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరానికి 185 మంది పేషెంట్లు రావడం జరిగిందని, వారికి పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో 40 మంది కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు చంద్రగుప్త, జగదీష్, ఆర్కే వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

విశాలాంధ్ర-అవుకు: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని ఐసిడిఎస్ సూపర్వైజర్లు శివమ్మ, పావని అన్నారు. గురువారం మిషన్-వాత్సల్య బాలికా దినోత్సవం సందర్భంగా అవుకు పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినీలతో ర్యాలీ నిర్వహించారు. బస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించి బాల్యవివాహాల నిర్మూలనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా లింగ సమానత్వము మరియు సాధికారత కోసము లక్ష్యంగా బాలికల హక్కులు విద్య ఆరోగ్యము మరియు భద్రత గురించి పాఠశాల విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఇంగలదహాల్ స్కూల్ కాంప్లెక్స్‌ను కొనసాగించాలి

విశాలాంధ్ర – హొళగుంద: మండలంలోని ఇంగలదహాల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ను యథావిధిగా కొనసాగించాలని కర్నూలుకు వచ్చిన రాష్ట్రా విద్యా కమిషనర్ సురేష్, జిల్లా విద్యా శాఖ అధికారి శ్యాముల్‌కి వినతి పత్రం అందజేశామని ఎంపీటీసీ మల్లికార్జున శుక్రవారం తెలిపారు. ఇంగలదహాల్ గ్రామ పెద్దలువెంకటరామిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ ఉరుకుంద, యూత్ అసోసియేషన్ సభ్యులు కలిసి స్కూల్ కాంప్లెక్స్ గురించి ఉన్నతాధికారులకు వివరించామని అన్నారు. స్పందించిన విద్యాశాఖ అధికారులు కాంప్లెక్స్‌ల విషయాలను పరిశీలించి అందరి అభిప్రాయాల మేరకు నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కాంప్లెక్స్‌లను తొలగింపును పునఃపరిశీలన చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంగలదహాల్, ఎండి హల్లి, పెద్ద గోనెహాల్ గ్రామ పెద్దలు యూత్ సభ్యులు విరేష్, శేఖర్, సుభన్, హనుమంతు, రాజు, పంపాపతి, మల్లికార్జున, ఇబ్రహీం, శివ, నాగరాజు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు కీలకపాత్ర

విశాలాంధ్ర – పెద్దకడబూరు: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు ఆయుధం లాంటిదని తహసీల్దార్ శ్రీనాథ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరు తహసీల్దార్ కార్యాలయం నందు ఓటర్ దినోత్సవం సందర్భంగా కార్యాలయం సిబ్బందితో ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు ఓటర్ నమోదుకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ నారాయణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక వెంకాయపల్లెలోని జీ.పులయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ట్రాఫిక్ రూల్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ జీ.శశి కుమార్ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆర్టీవో భరత్ చావన్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మరియు కర్నూలు తాలూకా ఎస్ఐ జీవి సెట్ వుల్లయ్య ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ అవగాహన కల్పించారు. విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థులను త్రిబుల్ రైడింగ్ వెళ్లొద్దని హెల్మెట్ ధరించాలని మరియు ట్రాఫిక్ సిగ్నల్స్ తూచా తప్పకుండా పాటించాలని తద్వారా యాక్సిడెంట్‌ని నియమించగలరని వివరించారు.

ఆడపిల్ల చదువు అవనికి వెలుగు

విశాలంధ్ర – కోసిగి : ఆడపిల్ల చదువు అవనికి వెలుగని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య అన్నారు. శుక్రవారంజిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల కోసిగిలో జాతీయ బాలిక దినోత్సవం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ మౌనిక పాల్గొని మాట్లాడారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుండేలా తమ పిల్లలను తల్లిదండ్రులు తీర్చిదిద్దాలన్నారు. సమాజంలో అవకాశాలు బాల, బాలికలకు సమానంగా ఉన్నాయని తెలిపారు. బాలికలు ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఇంచార్జ్ హెడ్మాస్టర్ స్వర్ణకుమారి, వైద్య సిబ్బంది కోటేశ్వరమ్మ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ఖిద్మత్ బ్యాంకు సేవలు సంతృప్తికరం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : నంద్యాల ఖిద్మత్ సొసైటి వడ్డీ రహిత ఋణాలు ఇస్తు చిన్న వ్యాపారులకు అండగా ఉంటుంది. నేటి రుణ వంపిణిలో ప్రముఖ బులియన్ మార్కెట్ ప్రముఖులు, టీడిపి వట్టణ అధ్యక్షులు మణియార్ ఖలీల్ అహమ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఖిద్మత్ లో పది లక్షల రూపాయల రుణాలు పంపిణి చేసారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ జమాఅతె ఇస్లామీ హింద్ లాంటి ఉత్తమ సంస్థ, నిస్వార్థ సేవకులు సొసైటి నిర్వహిస్తున్నారని, రెండు సంవత్సరాలలో వలుమార్లు సందర్శించానని ఖిద్మత్ పట్ల సంతృప్తిగా వారిని ప్రోత్సహిస్తు తన వంతుగా డిపాజిట్ చేస్తానని ప్రకటించారు. మార్కెట్ లో వడ్డీతో సతమతమయ్యే చిన్న వ్యాపారులు ఖిద్మత్ సభ్యులుగా చేరి, దాని సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బ్రాంచ్ అధ్యక్షులు యూనూస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖిద్మత్ జిల్లా డైరెక్టర్ అబ్దుల్ సమద్ మాట్లాడుతూ నంద్యాల బ్రాంచి రెండేళ్ళలో పదిహేను వందల సభ్యులతో రూ.60 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తుందని, పది కోట్లు ఋణాలుగా ఇచ్చినట్లు తెలిపారు. ఖిద్మత్ మ్యూచవల్ ఎయుడెడ్ కోఆపరేట్ త్రిఫ్ట్ క్రెడిట్ సొసైటి ఎంపి మాక్స్ 1995 ద్వారా ప్రభుత్వం ఆమోదితమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖిద్మత్ మేనేజర్ ఇలియాస్, సభ్యులు హాఫీజ్ జమాన్, ఆసీఫ్, ఇలియాస్, ముహమ్మద్ షఫీ తదితర సభ్యులు పాల్గొన్నారు.

గురురాజా విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల: నంది విజ్ఞాన కేంద్రం వారు నంద్యాల పట్టణం మున్సిపల్ టౌన్ హాల్ నందు నిర్వహించిన జిల్లాస్థాయి ద్వితీయ నంది బాలోత్సవం పోటీల నందు నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీ నందుగల శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ఏకంగా 20 బహుమతులు సాధించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి.షేక్షావలి రెడ్డి తెలిపారు. ప్రవేశించిన ప్రతి విభాగంలో బహుమతులను సాధించారు. చిత్రలేఖనం సబ్ జూనియర్స్ విభాగంలో ఇషాన్ రెడ్డి ప్రథమ స్థానం, కార్తీక్ తృతీయ స్థానం, జూనియర్ విభాగంలో దేవేంద్ర ద్వితీయ స్థానం, సీనియర్ విభాగంలో ఎన్.ధనుష్ ద్వితీయ స్థానం, కార్టూన్ కాంపిటీషన్ నందు జూనియర్స్ విభాగంలో దుర్గ ప్రథమస్థానం, ఎస్.నాయబ్ రసూల్ తృతీయ స్థానం, సీనియర్ విభాగంలో ఎన్.ధనుష్ ద్వితీయ స్థానం సాధించారు. శాస్త్రీయ నృత్య ప్రదర్శన సోలో విభాగంలో పి.సరయు ద్వితీయ స్థానం, జానవద నృత్య ప్రదర్శనలో కె.తన్వి ప్రథమ స్థానం, జానపద నృత్య ప్రదర్శన బృందం నందు ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థుల విజయాలకు చక్కని శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన

విశాలాంధ్ర – చాగలమర్రి : మండలం లోని శెట్టివీడు గ్రామంలో మండల పశువైద్యాధికారి సాయిబాబా, నేలంపాడులో వైద్యాధికారులు రవీంద్రారెడ్డి, దీపాకుమారిల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్యులు పశువులకు, గొర్రెలకు,మేకలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు.కార్యక్రమం లో శెట్టివీడు మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, విఎల్ఓ మురళి, ఏహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, భ్రూణ హత్యల నిర్వారణకు కలసి కట్టుగా కృషి చేయాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్: బాల్య వివాహాలు భ్రూణ హత్యల నివారణకు అన్ని శాఖ అధికారులు కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహశీల్దార్ శివరాముడు సూచించారు. మహిళల అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ఐసిడిఎస్ సమావేశ హాల్లో సిడిపిఓ ఉమామహేశ్వరి అధ్యక్షతన సచివాలయ, హెల్త్ అధికారులతో కిషోరి వికాసం శిక్షణ కార్యక్రమం జరిగింది. శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహశీల్దార్ శివ రాముడు మాట్లాడుతూ ప్రస్తుతం పెరుగుతున్న కాలంలో బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు అన్నవి రోజురోజుకు పెచ్చిమీరి పోతున్నాయన్నారు. కూతుర్లపై ఏ విధంగా శ్రద్ధ పెట్టి పెంచుతున్నారో, కొడుకులపై కూడా అదే రీతిలో శ్రద్ధ పెట్టి పెంచాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రులపై ఉందన్నారు. కూతురు కాలేజీకి వెళ్లిన స్కూలుకు వెళ్లిన అవసరం కొద్ది బయటకు వెళ్లిన ఎందుకు లేట్ అయిందని ప్రశ్నిస్తున్నారని, కొడుకులను ఎందుకు నిలదీయడం లేదన్నారు. అదే కూతుర్ల మాదిరిగా కుమారులను పెంచినట్లయితే బాల్యవివాహాలు, ప్రేమలు దూరమవుతాయని ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. మహిళలకు విద్య, మంచి ఆరోగ్యం,భద్రత ఎంతగానో ముఖ్యమన్నారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ టెక్నాలజీ ఆధారపడి జీవనం గడుపుతున్నారని, టెక్నాలజీని సరైన మార్గంలో వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌వో సత్యవతి దేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడంతో పిల్లల ప్రసూతి సందర్భంలో ఆరోగ్య సమస్యలు, ప్రసూతి సక్రమంగా జరగకపోవడం అధికమవుతున్నాయని తెలిపారు. 60 శాతం వివాహితుల్లో బలహీనంగా ఉంటున్నారని, దీనంతటికీ కారణం బాల్యవివాహాలేనని తెలిపారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ను కేటాయించి తగిన శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు. అంగన్వాడి కేంద్రాలలో,ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు ప్రభుత్వం మంచి పౌష్టికాహారంతో పాటు మందులను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ శంకరాచారి, సీఆర్పీలు మల్లికార్జున, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఏఎల్ఎస్ఏ కొత్త మాడ్యూల్ పథకాలపై అవగాహన శిబిరం

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్ : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, కర్నూలు వారు నేషనల్ లీగల్ సర్వీసెస్ వారి ఆదేశాల మేరకు స్టేట్ లీగల్ సర్వీసెస్ వారి ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల యందు నల్సా న్యూ మోడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపును నిర్వహించారు. ఈ సమావేశనికి ముఖ్య అతిధులు గా కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.కబర్ధి, కర్నూలు క్లస్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ డివిఆర్ సాయి గోపాల్ హాజరయ్యారు. జిల్లా జడ్జి మాట్టాడుతూ ఎన్ఏఎల్ఎస్ఏ పథకం, 2015 ఎన్ఏఎల్ ఎం పథకం 2024, బాలికల సాధికారత మరియు వారి హక్కుల పరిరక్షణకు అనేక చట్టాలు కలవని తెలిపారు. జిల్లా న్యాయ సేవాది కార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లడుతూ భవన నిర్మాణ కార్మికులకు గవర్నమెంట్ గుర్తింపు కార్డు మరియు అసంఘటిత కార్మికులకు ఈ శ్రామ్ కార్డులు లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా ఏర్పాటు చేసిన శిబిరం ద్వారా ఇప్పించడం జరిగింది అని తెలిపారు. జిల్లా వినియోగదారుల ఫోరమ్ అధ్యక్షులు కె.కిషోర్ కుమార్ వినియోగ దారుల హక్కుల గురించి వివరించారు. చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ నిర్మల ఈ సమావేశంలో జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాల కార్మికుల నిషేధం, బాలికల అక్రమ రవాణా నిషేధం గురించి తెలిపారు. తదనంతము సిల్వర్ జూబ్లీ కాలేజి అఫ్ క్లస్టర్ యూనివర్సిటీ నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఉత్తీర్ణులైన పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సాంబశివ, డిసిపిఓ శారదా, సిడబ్ల్యుసి చైర్మన్ జుబేదా బేగం, జిల్లా వినియోగ దారుల ఫోరమ్ మెంబర్ నజీమా కౌసత్, సిల్వర్ జూబ్లీ కాలేజి అఫ్ క్లస్టర్ యూనివర్సిటీ ప్రిన్సిపల్ వివిఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, లెక్చరర్ డాక్టర్ ఎల్లా కృష్ణ, ఎన్‌జిఓ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, అబ్సర్వేషన్ హెూమ్ సూపరింటెండెంట్ హుస్సేన్ బాష, కళాశాల విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర – హొళగుంద: మండలంలోని ప్రజలు ఎన్నికల్లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ రెడ్డి నిజాముద్దీన్ విజ్ఞప్తి చేశారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా తహశీల్దార్ కార్యాల ఆవరణంలో ప్రతిజ్ఞ చేసి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశం ఎంతో గొప్ప దేశమని కొనియాడారు. అతి పెద్ద ప్రజాస్వామ్యం గల దేశమని ప్రజలు ఓటు హక్కు వల్ల తమకు నచ్చిన నేతను, ప్రజా ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఉన్నదని అందువల్ల అర్హులైన యువతి ,యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటే సిబ్బంది ద్వారా విచారించి ఓటు హక్కు మంజూరు చేస్తామని అన్నారు. ఓటుహక్కు వజ్రాయుధం లాంటిదని ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉన్నదని అన్నారు. ప్రజలు ఓటు హక్కును దుర్వినియోగం చేసుకుంటే మంచి పద్ధతి కాదని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డిటీ ముకుందరావు, వీఆర్వోలు నాగరాజు, దామోదర్, ప్రహల్లాద, ఈరన్న, సురఆంజనేయ, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి రెవెన్యూ సిబ్బంది నరసప్ప, బసవ, జయప్ప, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఆర్ఎస్ డి టీ ముకుందరావు జాతీయ ఓటు హక్కు దినోత్సవాన్ని నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కు గురించి విద్యార్థులు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ కి ప్రవీణ, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి ప్రాణాలను కాపాడుకోండి

విశాలాంధ్ర -అవుకు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని బనగానపల్లి రూరల్ సీఐ మంజునాథ్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ అదిరాజు సింగ్ రాణా, డోన్ డిఎస్పి శ్రీనివాసులు ఆదేశాల మేరకు అవుకు ఎస్ఐ రాజారెడ్డితో కలిసి బనగానపల్లి రూరల్ సిఐ మంజునాథ్ రెడ్డి మండలంలోని రామాపురం, చెర్లోపల్లి గ్రామాలలో హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి,ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు. గ్రామస్తులకు, యువకులకు హెల్మెట్ వాడటం వలన ఉపయోగాలను వివరించారు. ద్విచక్ర వాహనంపై అతివేగంగా ప్రయాణించరాదని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని అన్నారు. ముఖ్యంగా మైనర్లకు ద్విచక్ర వాహనాలను ఇవ్వరాదని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల: భవిష్యత్తులో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రపంచంలోని అందరం ఆరోగ్యంగా ఉండా లంటే పర్యావరణ పరిరక్షణ ప్రథమ ధ్యేయంగా ప్రతి ఒక్కరము కృషి చేయాలని, విద్యార్థి దశ నుండే మొక్కలు నాటడం, సంరక్షించుకోవడం ప్రధాన లక్ష్యంగా విద్యార్థులు కృషి చేయాలని, ఇది కూడా ఒక రకంగా దేశ రక్షణలో, దేశ అభివృద్ధిలో భాగమేనని జాతీయ పర్యావరణ పరిరక్షణ నాయకులు యాగంటీశ్వరప్ప నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మలసత్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సు కార్యక్రమానికి రెడ్ క్రాస్ సొసైటీ నంద్యాల జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల, కళాశాల బాటనీ లెక్చరర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ చక్కగా విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేసేలా వివరించిన యాగంటీస్వరప్ప, కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. యాగంటీస్వరప్ప మాట్లాడుతూ ప్రపంచంలో పర్యావరణ పరిరక్షణలో మొట్టమొదటగా ప్రపంచంలోనే అత్యున్నత నోబెల్ అవార్డు పొందిన కెన్యా దేశస్థురాలు వంగరి మత్తయి గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, అలాగే మన దేశంలోనే సుమారు 300 సంవత్సరాల క్రితం మొక్కలను కాపాడడానికి 333 మంది మహిళలు అమృతమాత బిస్నోయి నాయకత్వంలో ప్రాణాలు విడిచిన విషయాన్ని విద్యార్థులకు విశదీకరించరు. ఒక్కొక్క మొక్క నాటడం ద్వారా దాన్ని పరిరక్షించుకోవడం ద్వారా, కొన్ని లక్షల రూపాయల విలువైన ఆరోగ్యకరమైన గాలి మనకు అందుతుందని, వాటిని సంరక్షించుకోకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుందని, ప్రతి ఒక్కరూ భవిష్యత్తులో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టబోయే పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

విశాలాంధ్ర – చాగలమర్రి : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని జీఎంఎస్‌కేలు ప్రసన్న, పర్వీన్‌లు అన్నారు. శుక్రవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సెయింట్ అన్స్ హైస్కూల్లో విద్య నభ్యసిస్తున్న బాలికలకు బాల్య వివాహ నిషేధిత అంశంపై అవగాహన కల్పించారు. పెళ్లి వద్దు, చదువు ముద్దు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బాల్యవివాహాల నిషేధిత చట్టంపై బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ చాటిన విద్యార్థినులకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పాఠశాల హెడ్మాస్టర్ సిస్టర్ స్మిత, కరస్పాండెంట్ త్రిష బహుమతులను అందజేశారు. అనంతరం సచివాలయ మహిళా సంరక్షక కార్యదర్శి ప్రసన్న మాట్లాడుతూ బాల్యవివాహాల వలన తల్లి బిడ్డ మృతి చెందడం వంటి దుష్ఫలితాలు ఉంటాయన్నారు. తక్కువ బరువు ఉన్న శిశువులు జన్మించడం, గర్భస్రావాలు వంటి అనారోగ్య పరిస్థితులు ఎదురవుతాయని అన్నారు. బాల్యవివాహాలు చేసిన వారికి, వివాహానికి హాజరైన వారికి, వివాహం జరిపించిన వారికి, సెక్షన్ 10 ప్రకారం శిక్ష అర్హులు అన్నారు. బాల్యవివాహాలు చేస్తున్నారని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆమె తెలిపారు. 10 98, 181, 100 కాల్స్ కు సమాచారం అందజేయాలన్నారు. బలవంతంగా అక్రమంగా బాలికలను రవాణా చేయడం, వారితో బిక్షాటన చేయించడం, మత్తు మందులు విక్రయించడం తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పనులు చేస్తే వారిపై సమాచారం అందించాలని వారు కోరారు. ఇట్టి చాకిరి చేయించడం, బాలికలపై లైంగిక నేరాలు, తదితర వాటిపై సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. అంగన్వాడి టీచర్లు చంద్రకళ, హసీనా వహీదా, ఇందుమతి, సుజాత మాబుచాన్ రహమత్ మైమూన్, సువర్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్ నరసింహ పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకో.. భవితను మలుచుకో

విశాలాంధ్ర – కర్నూలు సీటీ: ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని, శుక్రవారం నగరపాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సిబ్బందిచే ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఓటరే ప్రజాస్వామ్య శక్తి అని, దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమేనన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు కలిగిన ప్రతి ఒక్కరు ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వినియోగం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మంచి సమాజ స్థాపనకు ఓటే కీలకమన్నారు. ఆలోచించి ఓటు వేయాలని, ఓటింగ్లో పాల్గొనకపోతే దేశ భవిష్యత్తుకు నష్టం తెచ్చేవారవు తారన్నారు. ఎలాంటి ప్రలోభాలకు పాల్పడకుండా సరైన నాయకుడ్ని ఎన్నుకోవడంలో యువకులు ముందుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో, తహసిల్దార్ ఇ.వెంకటలక్ష్మి, అదనపు కమిషనర్ ఆర్‌జివి క్రిష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, డిప్యూటీ తహశీల్దార్ డబ్లా ధనుంజయ్, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, టిపిఆర్‌ఓ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్లు ఏవి రమేష్ బాబు, మంజూర్ బాష, రామక్రిష్ణ, స్వర్ణలత, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.